

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో బోనాలు తీస్తున్న రజక సంఘం మహిళలు, పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో కాసారపు ఎల్లవ్వను ఆప్యాయంగా హత్తుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న కేటీఆర్

# రేవంత్ అవినీతి బట్టబయలు

మొదటిపేజీ తరువాయి...

సప్లయీస్ స్కాంల తరహాలో వదిలేస్తుందా? ఇది ఇప్పుడు ప్రజల ముందున్న మిలియన్ డాలర్ల ప్రశ్న' అని పేర్కొన్నారు. అధికారంలోకి రాక ముందు వందలకోట్లతో మొదలైన రేవంత్ అవినీతి బాగోతం ఏడాదిన్నరలో సీఎం పదవిని అడ్డం పెట్టుకొని ఏకంగా వేల కోట్లకు చేరిందని ఆరోపించారు. వేల కోట్లు కొల్లగొట్టడం వల్లే దివ్యమైన తెలంగాణ దివాలా తీసిందని విమర్శించారు. ధన దాహంతోనే ఈడీ కేసులో అడ్డంగా దొరికిపోయారని విరుచుకుపడ్డారు. 'ఇప్పుడు రేవంత్‌రెడ్డి..పొంగులేటి మాదిరిగా చీకట్లో బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకుంటారా? కేవలం చార్జిషీట్‌లో పేరు వరకే ఈడీ పరిమితమవుతుందా? లేదంటే రేవంత్‌రెడ్డిని విచారణకు పిలిచి మొత్తం అవినీతి డబ్బు కక్కిస్తుందా? అనే విషయం సమీప భవిష్యత్తులో తెలిసిపోతుంది' అని పేర్కొన్నారు. రోజురోజుకూ పెట్రేగిపోతున్న కుమ్ములాటలతో రాష్ట్ర కాంగ్రెస్ కకావికలమైందని విమర్శించారు. ముఖ్యనేతల తిరుగుబాటు భయంతో సీఎం కుర్చీ ఎప్పుడు పోతుందా అనే భయం రేవంత్‌ను అడుగడుగునా వెంటాడుతున్నదని దెప్పిపొడిచారు. దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్న కాంగ్రెస్, ముఖ్యమంత్రి అటెన్షన్ డైవర్షన్ డ్రామాకు తెరపడినట్టేనని వ్యాఖ్యానించారు. కాళేశ్వరంలో అవినీతి జరగలేదనే మాట సీఎం రేవంత్‌కు పిల్లనిచ్చిన మామ సూదిని పద్మారెడ్డి నోట రావడంతో ఆయనకు ఫ్యూజులు ఎగిరిపోయాయని ఎద్దేవాచేశారు. మొన్న మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలతో కాంగ్రెస్ కమీషన్ల వ్యవహారం బట్టబయలైందని, ఇటీవలి కాలంలో కాంగ్రెస్ నిర్వాకాలన్నీ వెలుగులోకి వస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఈడీ చార్జిషీట్‌తో ఇన్నాళ్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాపం పండినట్టేనని పేర్కొన్నారు.

### రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలి

నేషనల్ హెరాల్డ్ కేసులో సీఎం రేవంత్ పేరును ఈడీ చార్జిషీట్‌లో చేర్చిన నేపథ్యంలో ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అప్పట్లో కాంగ్రెస్ ముఖ్యనేత, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి రూ. 50 కోట్లకు పీసీసీ పదవి కొనుక్కున్నారని చేసిన ఆరోపణలు వాస్తవమేనని ఈడీ చార్జిషీట్‌తో రుజువైందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో రూ.50 లక్షల నగదు బ్యాగుతో దొరికిన వ్యక్తే ముఖ్యమంత్రి సీట్లో కూర్చొని విచ్చలవిడిగా ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని విమర్శించారు. రేవంత్ అవినీతి, అక్రమాలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ స్పందించాలని, ఆయనకు వంతపాడి ప్రజల్లో చులకన కావద్దని హితవుపలికారు.

## నాడూ నేడూ రేవంత్ వసూళ్ల పర్వం

**ఈడీ చార్జిషీట్‌తో బండారం బట్టబయలు • మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఫైర్**



హైదరాబాద్ మే 23 (నమస్తే తెలంగాణ): నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ చార్జిషీట్ దాఖలు చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవినీతి బండారం బట్టబయలైందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. నాడు పీసీసీ చీఫ్ హోదాలో పదవులు ఆశ చూపి విరాళాల పేరిట పైసల వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇప్పుడు సీఎం కుర్చీలో కూర్చొని ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పాలనను పక్కనబెట్టి ఢిల్లీకి మూటలు పంపుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంలా మారిందని తాము చెప్తున్నది నిజమని అనేందుకు ఈడీ చార్జిషీటే నిదర్శనమని పేర్కొన్నారు. 30 శాతం కమీషన్లు లేనిదే పనులు జరగడం లేదని గతంలో అధికార పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, తాజాగా మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను ఉదహరిస్తూ దీనికి సీఎం రేవంత్ ఏమని సమాధానం చెప్తారని ప్రశ్నించారు. గతంలో అమృత్, సివిల్ సప్లయ్ ఇతరత్రా స్కాంలపై ఫిర్యాదు చేసినా కేంద్రం పట్టించుకోలేదని దుయ్యబట్టారు. తెలంగాణలో ఆర్ ఆర్ ట్యాక్స్ వసూలవుతున్నదని స్వయంగా ప్రధాని మోదీయే ఆరోపించారని గుర్తుచేశారు. కానీ చర్యలు తీసుకోవడంలో మాత్రం చేతులెత్తారని విమర్శించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌పై చర్యలు చేపట్టి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు డాలస్ సిద్ధం

- ప్రముఖులతో సన్నాహక సమావేశం
- బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల వెల్లడి



హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు అమెరికాలోని డాలస్ సిద్ధమైంది. పార్టీ 25 ఏండ్ల విజయ ప్రస్థానం పూర్తిచేసుకున్న నేపథ్యంలో జూన్ 1న డాలస్‌లోని డీఆర్ పెప్పర్ వేదికగా రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. శుక్రవారం డాలస్ ప్రముఖులతో ఆ పార్టీ గ్లోబల్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల సన్నాహక సమావేశం నిర్వహించారు. యూఎస్ఏ అడ్వైజరీ బోర్డు చైర్మన్ తన్నీరు మహేశ్ ఆధ్వర్యంలో డాలస్ వాసి అనిల్ గ్రంధి నివాసంలో నిర్వహించిన సమావేశంలో దయాకర్ పూసుకురి, సతీశ్ (ఆటా), వంశీ టీటీఏ, రాజ్ పెరిగెల తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ బిగాల మాట్లాడుతూ.. రజతోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని తెలిపారు. కేసీఆర్ హయాంలో డాలస్‌ని మించి తెలంగాణ అభివృద్ధి చెందిందని ఇక్కడివారు అంటున్నారని చెప్పారు. ఇప్పటికే ఈ సభకు హాజరుకావడానికి అనేకమంది తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. రజతోత్సవ వేడుకలను ఇతర దేశాల్లో కూడా నిర్వహిస్తామని తెలిపారు. తన్నీరు మహేశ్ మాట్లాడుతూ.. ఇది బీఆర్ఎస్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# రేవంత్.. రాజీనామా చెయ్

- ఈడీ చార్జిషీట్‌లో పేరున్నా పదవిలో ఉండడం సిగ్గుచేటు
- పీసీసీ చీఫ్ హోదాలోనే దోపిడీ.. సీఎం హోదాలో అడ్డగోలు అవినీతి
- రేవంత్ దారిలోనే మంత్రులు, అధికారులు వెళ్తే రాష్ట్రం అంధకారం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఫైర్



హైదరాబాద్ మే 23 (నమస్తే తెలంగాణ): 'నేషనల్ హెరాల్డ్ కేసు చార్జిషీట్‌లో ఈడీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరును చేర్చినా.. ఆయన ఇంకా కుర్చీని పట్టుకొని వేలాడటం సిగ్గుచేటు.. ఇది యావత్ తెలంగాణ జాతికి అవమానకరం.. వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేయాలి' అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. పీసీసీ పదవిని అడ్డంపెట్టుకొని మొదలుపెట్టిన ఆయన అవినీతి వ్యవహారం.. ఇప్పుడు సీఎం హోదాలో రాష్ట్ర సరిహద్దులు దాటి జాతీయస్థాయికి చేరిందని ఫైర్ అయ్యారు. కేసీఆర్ హయాంలో దేశ వ్యాప్తంగా అభివృద్ధిపై చర్చ జరిగేదని, కానీ 18 నెలల కాంగ్రెస్ పాలనలో అవినీతిపై చర్చ జరిగే దుస్థితి రావడం బాధాకరమని అన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని జీడీపీ, తలసరి ఆదాయం, సాగునీరు లభ్యత, పంటల ఉత్పత్తి రంగాల్లో తలమానికంగా నిలిపారని, రేవంత్ మాత్రం అక్రమాలు, దోపిడీలు, దుర్మార్గాలతో తలవంపులు తెస్తున్నారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు వాసుదేవారెడ్డి, కురువ విజయ్‌కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి అవినీతిపరుడన్నది జగమెరిగిన సత్యమని అన్నారు. ఓటుకు నోటు దొంగ ఎవరంటే చిన్న పిల్లాడిని అడిగినా ఆయన పేరే చెప్తారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గతంలో పీసీసీ అధ్యక్ష పదవిని రూ.50 కోట్లకు కొనుక్కున్నాడని ప్రస్తుతం ఆయన దగ్గర పనిచేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, ఆ పార్టీ సీనియర్ నేత హన్మంతరావు ఆరోపించారని గుర్తుచేశారు. 'పీసీసీ అధ్యక్షుడయ్యాక ఆయన అక్రమాల పర్వం జూలువిదిల్చింది.. ఇక ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్న తర్వాత పరాకాష్టకు చేరింది' అని ఆరోపించారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలన అన్నిరంగాల్లో అవినీతే రాజ్యమేలుతున్నదని చెప్పారు. 30 శాతం కమీషన్లు ముట్టనిదే పనులు కావడం కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కమీషన్లు తీసుకోనిదే మంత్రులు ఫైళ్లు ముట్టరని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శమని ఉదహరించారు.

### తేలు కుట్టిన దొంగలా రేవంత్..

నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ చార్జిషీట్‌లో పేరు నమోదైనా సీఎం రేవంత్ తేలుకుట్టినా దొంగల వ్యవహరిస్తున్నారని శ్రవణ్ వ్యాఖ్యానించారు. రేవంత్ మౌనం వహిస్తున్నారంటేనే తప్పును అంగీకరించినట్లేనని స్పష్టంచేశారు. అవినీతి ఆరోపణలు వచ్చిన రేవంత్‌రెడ్డి నిర్లజ్జగా పదవిలో కొనసాగితే అనేక అనర్థాలు తలెత్తే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమార్కుడైన ముఖ్యమంత్రి దారిలో మంత్రులు, ఉన్నతాధికారులు నడిస్తే రాష్ట్రం అంధకారంలోకి వెళ్లే పరిస్థితి వస్తదని చెప్పారు.

### కవిత లేఖపై అనవసర రాద్ధాంతం..

ఎమ్మెల్సీ కవిత కేసీఆర్‌కు రాసినట్టు చెప్తున్న లేఖపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని శ్రవణ్ పేర్కొన్నారు. ఒకవేళ ఆ లేఖ నిజమేనని అనుకున్నా అందులో ప్రస్తావించిన విషయాలు గతంలో చర్చలో ఉన్నవేనని చెప్పారు. ఈ లేఖతో రాజకీయాల్లో వచ్చే మార్పేమీ ఉండబోదని తేలికగా కొట్టిపారేశారు. కానీ కాంగ్రెస్, బీజేపీ కూడ బలుక్కొని తప్పుడు ప్రచారం చేస్తు న్నాయని ఆక్షేపించారు. కేసీఆర్‌కు తన బిడ్డ రాసిన లెటర్‌లో అభ్యంతరకర విషయాలేమీలేవని, కొన్ని సరిదిద్దుకోవాల్సిన అంశాలుంటే పార్టీలో చర్చించి సరిచేస్తారని స్పష్టంచేశారు. దీనికి మీడియాలో అంతగా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదని అన్నారు.

### బీజేపీ నేతల మౌనమెందుకు?

'కేసీఆర్, బీఆర్ఎస్‌పై నిత్యం ఎగిరెగిరి పడే బీజేపీ నాయకులు నేషనల్ హెరాల్డ్ కేసులో సీఎం రేవంత్‌రెడ్డి పేరువచ్చినా ఎందుకు స్పందించడం లేదు? ఇదే కేసులో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పేరు వస్తే అక్కడి బీజేపీ నాయకులు గగ్గోలు పెడుతుంటే.. ఇక్కడి ఆ పార్టీ నాయకులు మౌనం వహిస్తున్నరెందుకు? లోపాయికారి ఒప్పందంతోనే పెదవులు మూసుకున్నారా?' అంటూ శ్రవణ్ సూటిగా ప్రశ్నించారు. నిత్యం బీఆర్ఎస్‌పై అగ్గిరాజేసే బండి సంజయ్, కిషన్‌రెడ్డి ఎక్కడికి పోయారని నిలదీశారు. నిజంగా బీజేపీ పెద్దలకు చిత్తశుద్ధి ఉంటే ఈ కేసులో సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

## ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ఇప్పట్లో లేనట్టే!

మొదటిపేజీ తరువాయి...

చూస్తుంటే జూలై రెండో వారం వరకు కౌన్సెలింగ్ కోసం వేచి చూడక తప్పదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎప్‌సెట్ ఫలితాలు విడుదలైన రోజు, లేదా మరుసటి రోజే వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేసిన దాఖలాలున్నాయి. కానీ ఈసారి ఫలితాలు విడుదలైన 2 నెలల వరకు ఆగాల్సి వచ్చేలా ఉంది.

### ఆలస్యం ఎందుకంటే?

రాష్ట్రంలో బీటెక్ కన్వీనర్ కోటా ఫీజులను సవరించాల్సి ఉన్నది. తెలంగాణ ఫీజు అడ్మిషన్ అండ్ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) ప్రతిపాదించిన ఫీజులపై సర్కారు అభ్యంతరం వ్యక్తంచేసింది. టీఏఎఫ్‌ఆర్సీలో సభ్యురాలు కాని ఓ ఐఏఎస్ అధికారి ఈ సమావేశంలో పాల్గొని ఫీజులపై అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో ప్రక్రియ మొదటికొచ్చింది. ఈ ఫీజులు ఖరారుకానిదే, ఫీజులు ఎంతన్నది తేలనిదే కౌన్సెలింగ్ నిర్వహించడం అసాధ్యం. కొంత కాలంగా ఐఐటీల్లో సీట్లు భర్తీచేసిన తర్వాతే మన దగ్గర ఇంజినీరింగ్ సీట్లను భర్తీచేస్తున్నారు. దీంతో మొదట ఐఐటీల్లో చేరాల్సిన వారు చేరగా, మిగిలిన వారు మన దగ్గర ప్రవేశాలు పొందుతున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు జూన్ 2న విడుదలకానున్నాయి. జూన్ 3 నుంచి జోసా కౌన్సెలింగ్ ప్రారంభమవుతుంది. ఆరు విడుతల కౌన్సెలింగ్ పూర్తికావాలంటే నెల రోజులు పడుతుంది. ఇంజినీరింగ్ కాలేజీల ఏఐసీటీఈ అఫిలియేషన్ ఇంకా కొలిక్కిరాలేదు. ఒక్క కాలేజీకి కూడా ఇప్పటి వరకు అనుమతులివ్వలేదు. సీట్ల లెక్క తేలలేదు. అఫిలియేషన్ల జారీ గడువును జూన్ 30 వరకు ఏఐసీటీఈ పొడిగించింది. ఈ అనుమతి లేకుండా ముందు కెళ్లడం కుదరదు. జూన్ 30లోపు కౌన్సెలింగ్ జరిగే అవకాశం లేదన్నమాటే. జూన్ నెలలో ఎప్‌సెట్ వెబ్‌కౌన్సెలింగ్ ఉండే అవకాశాల్లేవు. జూలై రెండో వారం తర్వాతే కౌన్సెలింగ్ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# వసూల్ రాజాలు

మొదటిపేజీ తరువాయి...

సోనియాగాంధీ, రాహుల్‌గాంధీకి చెందిన 'యంగ్ ఇండియన్' కంపెనీకి విరాళాలు ఇప్పించేందుకు అప్పటి తెలంగాణ పీసీసీ చీఫ్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన నలుగురు నేతలపై ఒత్తిడి తెచ్చినట్టు తెలుస్తున్నది. ఈ మేరకు ఏప్రిల్ 9న ఢిల్లీలోని స్థానిక కోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన అఫిడవిట్‌లో పలు కీలక విషయాలు ఉన్నట్టు 'ఇండియా టుడే' శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురించింది.

ఆ కథనం ప్రకారం 'యంగ్ ఇండియన్' కంపెనీకి భారీ ఎత్తున విరాళాలు ఇప్పించాలని కాంగ్రెస్ సీనియర్ లీడర్లకు ఆదేశాలు వెళ్లినట్టు ఈడీ ఆరోపించింది. దీంతో పలు రాష్ట్రాలకు చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు కొన్ని లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చినట్టు తెలిపింది. ఈ మొత్తం పరిణామాలను 'ఓ ఆర్థిక మోసాన్ని ప్రణాళికాబద్ధంగా కప్పిపెట్టేందుకు జరిగిన ప్రయత్నం'గా ఈడీ అభివర్ణించింది. డొనేషన్ల రూపంలో యంగ్ ఇండియన్ సంస్థకు బదిలీ అయిన నిధులన్నీ సోనియా గాంధీ, రాహుల్‌గాంధీకి చేరినట్టు ఈడీ తన చార్జిషీట్‌లో పేర్కొన్నది. యంగ్ ఇండియన్ సంస్థలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీకి 76 శాతం షేర్లు ఉన్నాయి. నేషనల్ హెరాల్డ్ పత్రికను అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) అనే సంస్థ ప్రచురిస్తున్నది. ఏజేఎల్‌కు రూ.2 వేల కోట్ల విలువైన ఆస్తులున్నాయి. ఈ ఆస్తులను కేవలం రూ.50 లక్షలకు చట్టవిరుద్ధంగా స్వాధీనం చేసుకొనేందుకు యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కుట్ర పన్నినట్టు ఈడీ ఆరోపించింది. ఈ లావాదేవీలో నిధుల దుర్వినియోగం, అక్రమంగా నగదు చేతులు మారాయని తెలిపింది.

### నలుగురికి రేవంత్ ఆదేశాలు

ఇండియాటుడే కథనం ప్రకారం.. యంగ్ ఇండియన్ కంపెనీకి విరాళాలు ఇవ్వాల్సిందిగా అప్పటి తెలంగాణ పీసీసీ చీఫ్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి 2019-22 మధ్య తెలంగాణకు చెందిన నలుగురు కాంగ్రెస్ నేతలకు సూచించారు. రేవంత్ ఆదేశాలతో



ఆ నలుగురు నేతలు యంగ్ ఇండియన్ కంపెనీకి 2022 జూన్‌లో రూ.80 లక్షల మేర విరాళాలు ఇచ్చారు. విరాళాలు ఇచ్చిన వారి జాబితాలో 2019లో లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన గాలి అనిల్‌కుమార్ (రూ.20 లక్షలు), మాజీ ఎమ్మెల్యే షబ్బీర్‌అలీ (రూ.20 లక్షలు), అప్పటి కాంగ్రెస్ నేత సుదర్శన్(రూ.15 లక్షలు), అప్పటి తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన ఓ వ్యక్తి రూ.25 లక్షలను ఇచ్చినట్టు తెలిపింది. కేవలం నెలరోజుల వ్యవధిలోనే ఈ విరాళాలన్నీ యంగ్ ఇండియన్ కంపెనీకి చేరినట్టు వివరించింది.

### డీకే శివకుమార్ కూడా..

తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక, పంజాబ్ నుంచి కూడా ఇలాంటి విరాళాలే యంగ్ ఇండియన్ కంపెనీకి చేరినట్టు ఇండియా టుడే వెల్లడించింది. కాంగ్రెస్ సీనియర్ నేత, ఏఐసీసీ మాజీ కోశాధికారి పవన్ బన్సల్ సూచనలతో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఆయన సోదరుడు, ఎంపీ డీకే సురేశ్.. యంగ్ ఇండియన్ కంపెనీకి చెరో రూ.25 లక్షలను 2022 ఏప్రిల్‌లో విరాళంగా ఇచ్చినట్టు పత్రిక తెలిపింది. డీకేకు చెందిన నేషనల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ రూ.2 కోట్లను విరాళంగా ఇచ్చినట్టు వివరించింది. పంజాబ్‌కు చెందిన కాంగ్రెస్ నేత అమిత్ విజ్ 2015లో మూడు విడతల్లో యంగ్ ఇండియన్ కంపెనీకి రూ. 3.3 కోట్లను ట్రాన్స్‌ఫర్ చేసినట్టు వెల్లడించింది. ఈడీ తన చార్జిషీట్‌లో రేవంత్‌రెడ్డి, దివంగత అహ్మద్ పటేల్, పవన్‌బన్సల్‌తోపాటు డీకే శివకుమార్ పేరును కూడా ప్రస్తావించినట్టు పత్రిక వివరించింది.



### స్వచ్ఛందంగా ఇచ్చినవేమీ కాదు

యంగ్ ఇండియన్ కంపెనీకి విరాళాలు ఇచ్చిన వారందరూ స్వచ్ఛందంగా ఇవ్వలేదని ఈడీ తన అఫిడవిట్‌లో పేర్కొంది. కొందరికి పదవి, టికెట్లు ఆశ చూపి విరాళాలు సేకరిస్తే, మరికొందరిని రాజకీయ భవిష్యత్తు ఉండబోదని, వ్యాపారాలు దెబ్బతింటాయని భయపెట్టి విరాళాలు సేకరించినట్టు వెల్లడించింది. ఇదంతా ఓ ఆర్థిక మోసాన్ని నేర్పుగా కప్పిపెట్టేందుకు జరిగిన ప్రయత్నమని అభివర్ణించింది. ఈ లావాదేవీలు పీఎంఎల్ఏ నిబంధనలను ఉల్లంఘించేలా ఉన్నాయో లేదో ప్రస్తుతం పరిశీలిస్తున్నట్టు ఈడీ వర్గాలు వెల్లడించాయి. ఈ కేసుకు సంబంధించి చార్జిషీట్‌లో ప్రస్తావించిన వ్యక్తులకు త్వరలో నోటీసులు జారీచేసి, విచారణకు పిలుస్తామని ఈడీకి అధికారి ఒకరు తెలిపారు. ఆధారాలు సేకరించి కోర్టులో అనుబంధ అఫిడవిట్‌ను కూడా దాఖలు చేయనున్నట్టు వెల్లడించారు.

### ఇచ్చిన హామీ తప్పారని సోనియాకు లేఖ

**యంగ్** ఇండియన్ కంపెనీకి విరాళాలు ఇచ్చేలా కాంగ్రెస్ నేతలపై సీనియర్లు ఒత్తిడి తెచ్చినట్టు తమ దర్యాప్తులో తేలిందని ఈడీ పేర్కొన్నది. ఈ క్రమంలో పలు కీలక విషయాలను వెల్లడించింది. దివంగత కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్ అభ్యర్థనను కాదనలేక యంగ్ ఇండియన్‌కి రూ.30 లక్షల విరాళాన్ని తన బ్యాంకు ఖాతా నుంచి ఇచ్చానని, మరో రూ. 20 లక్షలు నగదుగా ఇచ్చానని అరవింద్ విశ్వనాథ్ సింగ్ చౌహాన్ అనే కాంగ్రెస్ నాయకుడు చెప్పినట్టు ఈడీ అఫిడవిట్‌లో తెలిపింది. అహ్మద్ పటేల్ తనకు ఏఐసీసీ కార్యాలయంలో పోస్టింగ్ ఇప్పిస్తానని, 2019 లోక్‌సభ ఎన్నికల్లో తన అల్లుడికి హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీ టికెట్ ఇప్పిస్తానని హామీ ఇచ్చి యంగ్ ఇండియన్‌కు విరాళాలు తీసుకున్నారని రాజీవ్ గంభీర్ అనే మరో నాయకుడు వాంగ్మూలం ఇచ్చినట్టు ఈడీ తెలిపింది. అయితే తనకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో తన డబ్బులు వెనక్కి ఇవ్వాలంటూ గంభీర్ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి లేఖ రాసినట్టు ఈడీ వెల్లడించింది.

### అవును ఇచ్చాను.. తప్పేంటి?

'నేషనల్ హెరాల్డ్' కేసులో డీకే శివకుమార్ పేరును ఈడీ చార్జిషీట్‌లో ప్రస్తావించడంపై మీడియా శుక్రవారం ఆయనను ప్రశ్నించింది. దీంతో నేషనల్ హెరాల్డ్ న్యూస్ పేపర్‌కు తాను, తన సోదరుడు రూ.25 లక్షల చొప్పున విరాళంగా ఇచ్చామని డీకే అంగీకరించారు. తమ పార్టీ ఆధ్వర్యంలో నడిచే పేపర్‌కు విరాళం ఇస్తే తప్పేంటని ఎదురు ప్రశ్నించారు. తాము కష్టపడి సంపాదించిన డబ్బునే విరాళంగా ఇచ్చినట్టు తెలిపారు. ఇందులో తప్పేమీలేదని పేర్కొన్నారు. ఏఐసీసీ మాజీ కోశాధికారి పవన్ బన్సల్ ఆదేశాల ప్రకారమే తాము ఈ విరాళం ఇచ్చామన్న డీకే.. యంగ్ ఇండియన్ కార్యకలాపాల గురించి, ఈడీ ఆ కంపెనీపై దర్యాప్తు చేస్తున్న విషయం గురించి తనకు తెలియదని చెప్పారు. తాను, తన సోదరుడు ఇచ్చిన విరాళాలపై ఈడీ ఇప్పటికే ప్రశ్నించినట్టు ఓ ప్రశ్నకు సమాధానంగా డీకే తెలిపారు.

## లోకం పోకడ




## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 36.7°c | 23.7°c |
| నల్లగొండ | 36.5°c | 23.0°c |
| ఖమ్మం | 36.0°c | 26.0°c |
| వరంగల్ | 36.0°c | 25.0°c |
| రంగారెడ్డి | 35.3°c | 22.1°c |
| మెదక్ | 34.6°c | 22.0°c |
| హైదరాబాద్ | 32.2°c | 23.9°c |
| కరీంనగర్ | 32.0°c | 26.0°c |
| నిజామాబాద్ | 31.5°c | 24.1°c |
| మహబూబ్‌నగర్ | 30.0°c | 27.0°c |



## గురుకుల విద్యార్థులకే మెస్ బాధ్యత!

**స్టూడెంట్స్‌తో ప్రత్యేకంగా 3 కమిటీలు**

**ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు**

**ప్రిన్సిపాళ్లకు సొసైటీ సెక్రటరీ ఆదేశాలు**

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీల్లోని పాఠశాలలు, కళాశాలల్లో కిచెన్ బాధ్యతలను విద్యార్థులతో నిర్వహించాలని గురుకుల సొసైటీ నిర్ణయించింది. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి వర్షిణి శుక్రవారం ప్రిన్సిపాల్స్‌తో జూమ్ మీటింగ్ నిర్వహించారు. రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించి పలు ఆదేశాలు జారీచేశారు. గురుకుల కిచెన్ బాధ్యతలపై చర్చించారు. ప్రస్తుతం గురుకుల వార్డెన్ కమ్ కేర్‌టేకర్‌గా ప్రిన్సిపాల్ కొనసాగుతున్నారు. వారి పర్యవేక్షణలోనే టీజీటీ, పీజీటీలు డిప్యూటీ వార్డెన్, అసిస్టెంట్ కేర్ టేకర్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కేర్‌టేకర్, అసిస్టెంట్ కేర్‌టేకర్ వ్యవస్థను తీసేస్తున్నట్టుగా సమావేశంలో వర్షిణి స్పష్టంచేశారు. మెస్ బాధ్యతలను విద్యార్థులకే అప్పగించనున్నట్టు తెలిపారు. ప్రతినెలా విద్యార్థులతో 3 డైట్ కమిటీలను ఏర్పాటు చేయాలని, ఒక కమిటీ మెస్ ఇండెంట్ పెట్టడం, రెండో కమిటీ వంట సామగ్రి భద్రపరచడం, వంట సిబ్బందికి ఇవ్వడం, మూడో కమిటీ కుకింగ్ బాధ్యతలను నిర్వర్తించేలా చూడాలని సూచించారు. గురుకుల ఇంటర్ ప్రవేశాలను జూన్ 15వ తేదీలో పూర్తి చేస్తామని తెలిపారు. డైట్ కమిటీలు ఏర్పాటు నిర్ణయంపై ప్రిన్సిపాళ్లు తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు.

## 44వ సారి ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 23(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీకి వెళ్లారు. శుక్రవారం సాయంత్రం బయల్దేరి వెళ్లారు. సీఎం అయినప్పటి నుంచి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లడం ఇది 44వసారి కావడం గమనార్హం. ప్రస్తుత పర్యటనలో భాగంగా శనివారం ఢిల్లీలో జరిగే నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొనున్నారు. సమావేశంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను వివరించనున్నారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ పెద్దలతోపాటు కేంద్ర మంత్రులను కలిసే అవకాశం ఉందని తెలిసింది. నేషనల్ హెరాల్డ్ కేసు చార్జిషీట్‌లో రేవంత్‌రెడ్డి పేరున్నట్టు వార్తలు రావడంతో అధిష్ఠానం పెద్దలను కలిసే అవకాశం ఉందని తెలిసింది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి

**డిప్యూటీ సీఎం భట్టికి ఆర్ కృష్ణయ్య వినతి**

హైదరాబాద్, మే23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి రూ.6వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సచివాలయంలో బీసీ సంఘం నేతలతో కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సుదీర్ఘకాలంగా బకాయిలను చెల్లించకపోవడంతో బడుగు, బలహీనవర్గాలకు చెందిన 14లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు యాజమాన్యాలు కూడా కాలేజీలను నిర్వహించలేక మూసేసే దుస్థితికి చేరుకున్నాయని చెప్పారు. కార్యక్రమంలో బీసీ నేతలు నీల వెంకటేశ్, జూలపల్లి అంజి, అనంతయ్య, రాజేందర్, మోదీ రాందేవ్, రవియాదవ్, బాలస్వామి, భాస్కర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.